# న్యాయం నీకొకటి - నాకొకటి



వైశాఖి

"శ్రీనివాస్ ఎవరు ?" కఠినంగా ధ్వనించింది రావు కంఠం.

ఆఫీస్‌నుంచి అప్పుడే వచ్చిన భర్తకు కాఫీ అందించబోతున్న సుజాత అతని నోటి నుంచివచ్చిన ప్రశ్నకు అలాగే బిగుసుకు పోయింది. చేతిలోని కప్పు జారి, ముక్కలైంది.

భీతహరిణిలా నిలబడ్డ సుజాతను అసహ్యంగా చూస్తూ మరోసారి రెట్టించాడు రావు "మాట్లాడవేం" అంటూ

ఉలిక్కిపడింది సుజాత అయినా ఏం చెప్పాలో తెలియనిదానిలా చూస్తూ మౌనం వహించింది. వదలలేదు రావు "పోనీ విన్న పోయేకాలం ఇక్కడకు వచ్చిన జలజ అయినా తెలుసా ?"

గొంతు పెగుల్చుకుంది సుజాత "మీ పిన తల్లిగారమ్మాయని, మీ బావగారికి వారం క్రిందటే ఈవూరు ట్రాన్స్‌ఫరై వచ్చారనీ మీరేగా చెప్పారు" — 'వాళ్ళు తమ యింటికి దగ్గర్లోనే యిల్లు అద్దెకు తీసుకున్నారుట. తనను పరిచయం చేయటానికి భర్త తీసుకువచ్చినపుడు, ఆమెను చూడగానే ఎక్కడో, ఎప్పుడో చూసినట్లు అనిపించింది. అయితే వాసును గురించి అడుగుతూ, ఈమెను కలపటంలో అంతరార్థం ఏమిటి?' ఆలోచిస్తోంది సుజాత.

"ఓహ్ ! ఏం తెలివితేటలు ! అద్వితీయంగా నటిస్తున్నావు" క్షణం ఆగి అన్నాడు రావు, "అయినా అయిదేళ్ళ క్రిందటి సంఘటన నిజంగానే మర్చిపోయావేమో. పోనీ, నేనే చెప్తాను విను. శ్రీనివాస్ ఎవరో, జలజ ఎవరో గుర్తులేకపోయినా, హైదరాబాద్‌లో ఇందిరా నర్సింగ్‌హోమ్ నీకు గుర్తుండే వుంటుంది"

'ఇందిరా నర్సింగ్‌హోమ్ !' ఛెళ్ళుమని చరిచినట్లయింది సుజాతకు 'భగవాన్ ! ఈ జన్మలో తాను ఏదైతే మర్చిపోవాలనుకుంటోందో, దేన్నుంచి దూరంగా పారిపోవాలనుకుంటోందో ఆ జ్ఞాపకమే తనను తరిమి, తరిమి వేధిస్తోంది.'

"రహస్యం ఎలా బైటపడిందా అని ఆలోచిస్తున్నావా ?" వికటంగా నవ్వాడు రావు. "జలజ అప్పుడా నర్సింగ్‌హోమ్‌లో నర్సుగా చేసింది. పెళ్ళయ్యాక మా బావకు యిష్టం లేదని ఆ ఉద్యోగానికి రిజైన్ యిచ్చింది.

వాళ్ళకీవూరు ట్రాన్స్‌ఫరై వుండకపోతే, నీరహస్యం యింతత్వరగా బయటికి వచ్చేది కాదు పాపం." వెక్కిరింతగా అన్నాడు. చేతులతో ముఖం కప్పుకుంది సుజాత. కాసేపాగి అన్నాడు రావు, "పెళ్ళికిముందే కడుపు వస్తే ఇందిరా నర్సింగ్‌హోమ్‌లో అబార్షన్ చేయించుకున్నావని జనం చెప్పగానే వెంటనే నమ్మలేదు నేను. కానీ అనుకోకుండా నిన్నరాత్రి నీడైరీలో కన్పించిన ఈ ఫొటో చూశాక, దీనివెనకాలరాసినది చదివాక నమ్మక తప్పలేదు." జేబులోంచి శ్రీనివాస్ ఫొటోతీసి వెక్కితిప్పి చదివాడు. "విత్ ఎవర్‌లాస్టింగ్ మెమొరీస్ — శ్రీనివాస్" ఫొటో ఆమెమీదికి విసిరేసి, ప్యాంట్ జేబుల్లో చేతులు పెట్టుకుని అసహనంగా అటూ యిటూ పచార్లు చేశాడు రావు. సుజాత గోడకానుకుని నిలబడివుంది అలాగే. కళ్ళవెంటనీరు ధార కట్టింది. కాసేపటికి పచార్లుచేయటంఆపి కటువుగా అన్నాడు, "అడిగినదానికి ఏమీ చెప్పకుండా అలా ఏడుస్తూ నిలబడితే వాగి, వాగి నోర్మూసుకుంటానని నీ అభిప్రాయం కాబోలు. అలాంటి ఆశలేం పెట్టుకోకు. పెళ్ళికి ముందే ఈ విషయం చెప్పివుంటే పరిస్థితి ఎలావుండేదో కానీ, నిజం తెలిశాక మటుకు నీతో కాపురంచేస్తూ, పదిమందిచేత వేలెత్తి చూపించుకోలేను. విడాకులు యిచ్చేస్తాను. నీరహస్యం నాగుప్పిట్లో వుంది. కోర్టుకెక్కినా తేలికగానే పని అయిపోతుంది. కాదూ, పదిమందిలోనగా కోర్టులో నిలబడి, గతమంతా దండోరా వేసుకోవటం యిష్టం లేకపోతే, మనం విడిపోవటం, నేను మరో పెళ్ళి చేసుకోవటం నీకిష్టమేనని కాగితం మీద వ్రాసివ్వు. ఆలోచించుకో. ఏంచేస్తావో నీయిష్టం." విసురుగా వీధితలుపుతీసికొని బయటికి వెళ్ళిపోయాడు రావు.

నిలబడ్డచోటునే కుప్పకూలి పోయింది సుజాత. 'విడాకులు! పెళ్ళయి ఆర్నెల్లు తిరగకుండానే విడాకులు. అయిపోయింది. తను అనుకున్నంతా జరిగింది.' కుమిలికుమిలి ఏడ్చింది సుజాత. 'నాజీవితం సర్వనాశనమైపోయింది నీవల్ల వాసూ! ఏం చేస్తున్నావు? ఎక్కడున్నావు వాసూ?' ఆక్రోశించింది ఆమె అంతరంగం

* * *

పైన వెన్నెలచల్లగా వుంది కొబ్బరాకుల మాటునుంచి చందమామ దాగుడుమూతలు ఆడుతున్నట్లు తొంగిచూస్తున్నాడు. డాబా మీద చల్లగాలిలో పడుకుని, వెన్నెలలో తడుస్తున్న ప్రకృతి అందాలను తిలకిస్తున్న వాసు దగ్గరకు, తమలపాకుల పళ్ళెంతో వచ్చింది కృష్ణవేణి. చిలకలుచుట్టి అతని నోటికి అందిస్తూ, నెమ్మదిగా అంది, "నేనొకటి అడుగుతాను. కోపగించుకోకుండా చెప్తారుకదూ!"


"అంత కోపమొచ్చేది అయితే అడగకు" చిరునవ్వుతో తళతళలాడాయి వాసుకళ్ళు. లోలోపలే నవ్వుకుంది కృష్ణ.

"మాటలతో దాటెయ్యకండి. అసలు మీనుంచి తెలుసుకోవలసిన విషయం మరొకరిద్వారా వినటం నాకు చిన్నతనంగా వుంటుంది." మృదువుగా అంది.

గంభీరంగా చూశాడు వాసు, 'ఏమిటది' అన్నట్లు.

"మీరు ఒకసారి మీదగ్గరున్న ఆల్బమ్ మొదటిపేజీలో సుజాతఫోటో చూపించి చెప్పారు. స్నేహితురాలని. మొన్న సంక్రాంతికి మనం మీయింటికి వెళ్ళినపుడు నాతో శారద అక్కయ్య అంటే మీ చిన్నాదిన, "మీరు ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలనుకున్నారనీ, మీ పెద్దవాళ్ళకు ఇష్టంలేక వదులుకున్నారనీ చెప్పారు" ఒక్కక్షణం ఆగి అంది, "మీరు ఆ అమ్మాయిని ప్రాణాధికంగా ప్రేమించారని మీ ప్రవర్తనను బట్టి అనుకుంటున్నాను. అంతే నన్నేదో తేలికగా చూస్తున్నారని కాదు. నాతో యింత చనువుగా మసులుతున్నా- మీ మనసెక్కడో వున్నట్లు యిన్నాళ్ళూ అనుకునేదాన్ని. యిప్పుడే అర్థమైంది నావూహ నిజమేనని." ఆమె కంఠం రుద్ధమైంది. ఆమె అన్న చివరిమాటలు వినలేదు వాసు ఏదో ఆలోచిస్తూ, "అసలు మీ మధ్య సుజాత ప్రసక్తి ఎందుకువచ్చింది?" అడిగాడు.

కృష్ణవేణి మొహం ఎర్రబడింది కాసేపు తటపటాయించి; నెమ్మదిగా అంది "మనం హనీమూనకి మద్రాసు, బెంగుళూరు వెళ్ళి వచ్చాక తీసిన ఫోటోలుచూస్తూ ఆవిడ 'నాకు పెళ్ళయిన ఏడాదితిరక్కుండా రమ పుట్టింది. మీపెళ్ళై ఏన్నార్ధం కావస్తున్నా యింకా ఏం విశేషం లేదేమిటి' అని అడుగుతూ, 'వాసు నీతో సరిగ్గావుంటున్నాడా' అని అడిగారు. నాకెందుకో ఆ ప్రశ్నలో ఏదోదాగివున్నట్లనిపించి, 'ఎందుకలా అడుగుతన్నారు' అని నొక్కి అడిగాను. ఆవిడ తత్తరబడి, 'అబ్బే, ఏం లేదు. పెళ్ళికి ముందు బొత్తిగా పెళ్ళే యిష్టం లేనట్లు మాట్లాడితే అలా అడిగాను' అంటూ సర్దుకోబోయారు. నాకు పట్టుదల పెరిగింది. ఆవిడమనసు కనిపెట్టాలని చిన్ననాటకం ఆడాను. 'మీరు అడిగారు కనుక చెప్తున్నాను. యింతవరకూ ఎవరి దగ్గరా నోరు జారలేదు. ఆయన మనసు ఎవరిమీదో వుందనిపిస్తోంది. రాత్రి పది దాటేదాకా యింటికిరారు. మా పెళ్ళయి యిన్నాళ్ళయినా ఆయనదగ్గర నాకు సరిగ్గా చనువులేదు.' అంటూ గొంతులోకి పాద్య



# న్యాయం నీకొకటీ నాకొకటీ

మైనంత విచారాన్ని తెచ్చుకుని చెప్పాను: దానికి ఆవిడ చెప్పినవిషయం నాకు యింకా నమ్మబుద్ధి కావటంలేదు.'' వాసు వంక చూడకుండా, మొహంపక్కకు త్రిప్పుకుని అంది, "ఆ సుజాతతో మీచనువు చాలా దూరంపోయిందనీ, ఆమె హాస్పిటల్లో చేరి అబార్షన్ చేయించుకుందనీ......'' పెదిమలు కొరుక్కుంది కృష్ణవేణి. తర్వాత ఎలా మాట్లాడాలో తెలియనిదానిలా ఆగిపోయింది.

శ్వాస బిగబట్టి అంతవరకూ వింటున్న వాసు నిట్టూర్చాడు. "నువ్వు విన్నది నిజమే కృష్ణా.'' అతని మాటలకు పక్కనపిడుగు పడ్డట్లు అదిరిపడింది కృష్ణవేణి. అపనమ్మకంగా చూసింది.

"ఇంత వరకు నీకు ఈ విషయం చెప్పకపోవటం నా తప్పే. పాస్ట్ ఈజ్ పాస్ట్. గతం తిరిగిరాదు. దాన్ని మళ్ళీ తవ్వుకుని, మరొకరికి చెప్పుకుని బాధను పంచటంలో అర్థంలేదు. అందుకే నీకు చెప్పలేదు.'' కొంతసేపటివరకు మాట్లాడలేదు కృష్ణవేణి. నెమ్మదిగా అంది, "మీరు చాలా పొరపాటు చేసారు. మీరు ఎమ్. ఏ. ప్యాసయ్యారు. మీ సంస్కారం యింతేనా? ప్రేమించిన అమ్మాయిని, అందునా ప్రెగ్నెంట్ అయిన ఆడపిల్లను విడిచిపెట్టి, మరో పెళ్ళి ఎలా చేసుకోగలిగారు? యిలా అడుగుతున్నందుకు క్షమించండి. మీ పెళ్ళి మీ యిష్టప్రకారమే జరుగుతుంది కదా! దాన్నే చేసుకుంటానని మామయ్యకు గట్టిగా చెప్పలేదా?''


నిర్వేదంగా నవ్వాడు వాసు. "నేనునాన్నగార్ని అడగకుండా ఏ ప్రయత్నమూ చేయకుండానే ఊరుకున్నాననుకుంటున్నావా? ఎంత పిచ్చిదానివి! ఏటికి ఎదురీదాలనుకోవటం ఎంత అవివేకమో— జీవితంలో మనం కోరుకున్నవన్నీ పొందగలం అనుకోవటం అంతే అవివేకం. నేను పూర్తిగా ఓడిపోయాకే, సుజాతను వదులుకున్నాను.'' అతని కళ్ళలో నీటిపొరలు.

"కృష్ణా, ఈరోజు నన్ను కదిలించకపోతే అసలెప్పటికీ నీకు ఈ విషయం చెప్పేవాణ్ణి కాదేమో. అయినా ఏమని చెప్పను? ఎలా చెప్పను? గతంలోని నా హీనచరిత్రను, నా పిరికితనాన్ని నేనే ఎంతగానో అసహ్యించుకుంటున్నాను. నేను చేసిన తప్పుకు నిష్కృతి లేదని నాకుతెలును. కానీ ఏం చేయను? నా జీవితం నాదికాదు. నాకు జన్మనిచ్చి, పెంచి యింతవాణ్ణి చేసిన నా తల్లిదండ్రులది. నా సుఖంకోసం వారిని బాధపెట్టి, ప్రాణాలు తీసే కిరాతకుణ్ణి కాలేకపోయాను.'' కాసేపాగి అన్నాడు, "ప్రేమించిన అమ్మాయిని విడిచిపెట్టి మరోపెళ్ళి ఎలా చేసుకోగలిగావని అడిగావు కదూ! ఆమె నాకు దూరమయితే, అసలు జీవితంలో పెళ్ళే చేసుకోకూడదనుకున్నాను. నాకా అర్హతే లేదనుకున్నాను. ఎందుకో తెలుసా! సుజాతను అబార్షన్‌కి ఒప్పించినది నేనే కనుక!''

కృష్ణవేణి ముఖం పాలిపోయింది. "నిజమా'' గొణిగినట్లు అంది. గంభీరంగా అన్నాడు వాసు, "అసహ్యించుకుంటున్నావు కదూ, యిటువంటివ్యక్తిని పెళ్ళిచేసుకున్నందుకు. నాకు ఆ సమయంలో అంతకన్నా గత్యంతరం లేకపోయింది. ఎందుకంటే అప్పటికే చిన్నన్నయ్య శేఖర్‌కూ, వసంతక్కకూ పెళ్ళిళ్ళు కుదిరి, ముహూర్తాలు కూడా పెట్టారు. రెండునెలలే టైముంది. ఈ సమయంలో ఈవార్త పైకి వస్తే, ఆ రెండు పెళ్ళిళ్ళూ ఆగిపోవచ్చు. యింకా ఏటువంటి దుష్పరిణామాలు వస్తాయోనని భయపడ్డాను. పైగా అప్పుడు నేను యింకా ఎమ్. ఏ. ఫైనల్ చదువుతున్నాను. ఉద్యోగం సంగతలావుంచి, చదువైనా పూర్తికాలేదు. సుజాతను పెళ్ళి చేసుకోవటం నాబాధ్యతఅని నాకు తెలుసు. బాధ్యతకోసం కాకపోయినా ప్రేమించినందుకైనా, పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. కానీ ప్రేమంటే ఎన్నో అడ్డంకులను అధిగమించటం అని తెలియని పిచ్చివాణ్ణి!'' కనుకొలకుల్లో నిల్చిన నీటిని ఆమె చూడరాదని కన్నులు మూసుకున్నాడు వాసు.

"నేను తనకు చేసిన అన్యాయం గురించి సుజాత ఒక్కరిముందు కూడా పల్లెత్తుమాట అనలేదు. నర్సింగ్ హోమ్‌లో చేరినరోజున ఆమె అన్నమాటలు నేను జీవితంలో మర్చిపోలేను 'ఈ పనికి ఒప్పుకుని, నా జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నానని నాకెందుకో పదేపదే అనిపిస్తోంది' అంది. ఆమాట లెంతనిజం. ఆమె అబార్షన్ చేయించుకున్నందునే నేను ఆమె చేతుల్లోంచి జారిపోయాను. అలా కాక ఆమె తల్లి అయివుంటే— నా పాపను, నా బిడ్డ తల్లిని దూరంచేసుకోగలనా? 'పిచ్చిగా ఆలోచించకు' అంటూ అప్పుడు ఆమె మాటలు త్రోసిపుచ్చాను. 'నువ్వు నా దానివే. చదువు పూర్తయి, ఉద్యోగం రాగానే నిన్ను పెళ్ళిచేసుకుంటాను. నామాట నమ్ము' అంటూ మాట యిచ్చాను. నా వాగ్దానం చెల్లించుకోలేకపోయాను. ఆమె దృష్టిలో, యిప్పుడు నీ దృష్టిలో ఎంత దుర్మార్గుడిగా నిలబడ్డానో తల్చుకుంటే— నామీద నాకే అసహ్యం వేస్తోంది. ఉద్యోగం వచ్చాక నా పెళ్ళి ప్రసక్తి వచ్చినప్పుడు సుజాతనే చేసుకుంటానని యింట్లో చెప్తే పెద్ద రాద్ధాంతం అయింది. మేనరికం

(50వ పేజీ చూడండి)



# న్యాయం నీకొకటి నాకొకటి

(18వ పేజీ తరువాయి)

వదులుకుని పై సంబంధం చేసుకుంటానికి ఎవరూ ఒప్పుకోలేదు. మీ నాన్న, మా అమ్మ తోబుట్టువులే అయినా, మీరు ఆస్తిపరులు కావటంచేత, ఎక్కడో దూరంగా కలకత్తాలో వుండటంచేత మనమధ్య రాకపోకలు తక్కువ. అయినా బ్యాంక్ ఆఫీసర్‌గా నా హోదా చూసి మామయ్య పాతికవేలు కట్నం యిస్తానన్నారు. డబ్బుకోసం కాకపోయినా, రక్త సంబంధం వదులుకోలేని అమ్మ—సుజాతను మర్చిపొమ్మని ప్రతిమలాడింది. బుజ్జగించింది. నేను వినలేదు. ఆమె కోపంతో, బాధతో ఆవేశపడటంతో హార్ట్ ఎటాక్ వచ్చింది. మృత్యువు వెంట్రుకవాసిలో తప్పిపోయింది. ఇంటో అంతా నన్ను నేరస్థుణ్ణి చూసినట్టు చూశారు. నిజంగా ఆమె మరణిస్తే దానికి బాధ్యులెవరు? అప్పటికి తలవంచాను. ఎవరికీ యిష్టంలేని పెళ్లి చేసుకుని నేను బావుకునేదేమిటి అనుకున్నాను. నీతో పెళ్లయ్యాక మనసు కుదుటపర్చుకున్నాను. నలుగురిలో విందుగా తిరగటం నేర్చుకున్నాను నీ కోసం. మన పెళ్లి అయిన ఏడాదికి సుజాతకు కూడా ఎవరో లెక్చరర్‌తో పెళ్లి అయింది. రవి అంటే సుజాత అన్నయ్య స్వయంగా వచ్చి శుభలేఖ యిచ్చాడు. ఆడవాళ్లు సంసార తాపత్రయంలో పడ్డాక గతాన్ని తేలికగా విస్మరిస్తారు. అందుకే యికనేను దిగులుపడనక్కర్లేదు. అయినా ఒంటరిగా కూర్చున్నప్పుడు, యివన్నీ గుర్తుకొస్తే బాధగా వుంటుంది, ఆమె జీవితాన్ని కళంకం చేసానని." భారంగా నిట్టూర్చాడు వాసు.

బొమ్మలా మౌనంగా కూర్చుండిపోయింది కృష్ణవేణి. వెలిసిపోయిన చిరునవ్వుతో అన్నాడు వాసు, "మాట్లాడవేం కృష్ణా! అంతా తెలిసాక అసహ్యించుకుంటున్నావు కదూ. యిన్నాళ్లూ జరిగినదేదో జరిగిపోయింది యిక యిప్పుడేం చెయ్యాలా అని ఆలోచిస్తున్నావు కదూ! నువ్వు బి. ఎ. చదివావు. జీవితం ప్రక్కదారి పడితే సరిదిద్దుకోగల వివేకం, సంస్కారం నీకున్నాయి. జరిగినదంతా చెప్పాను. నీ నిర్ణయం ఎటువంటిదైనా, నాకు అభ్యంతరం వుండదు. జీవితంలో ఒకసారి ఓడిపోయాను మరోసారి కూడా దెబ్బతిననని వస్తే..." అతని నోటికి చెయ్యి అడ్డుపెట్టింది కృష్ణవేణి. "నా మనసేమిటో నా ఆలోచనలెలా వున్నాయో తెలుసుకోకుండా ఏంమాటలవి? నాకు పెళ్లికిముందే ఈ విషయం తెలిసివుంటే అత్తయ్యను ఒప్పించి మీ పెళ్లి నా చేతుల మీదుగా చేసేదాన్ని. నా దురదృష్టం ఏమిటోగానీ మనమధ్య అసలు బావా మరదళ్లు కుండవలసిన చనువేలేదు. నాకు ఆరేళ్ల వయసప్పుడు మిమ్మల్ని చూశాను. మళ్లీ చూడటం మన పెళ్లిలోనే."

అతనికళ్లలోకి సూటిగా చూస్తూ అంది, "యిదంతా తెలిపింగని మీకు దూరమవుతానని అనుకుంటే పొరపాటే. బావా, మీ మనసు మెత్తనిది సున్నితహృదయులు కనుకనే యింకా జరిగినది మర్చిపోలేక బాధపడుతున్నారు. పరిస్థితులు అనుకూలించి వుంటే మీ బాధ్యత మీరు నిర్వర్తించేవారు. మనం కాలానికి, పరిస్థితులకు బందీలం. నేను మీ స్థానంలో వుంటే ఎలా ప్రవర్తించి ఉండేదాన్ని అని ప్రశ్నించుకుంటే దొరికిన జవాబు యిది." అతని తల ఒడిలోకి చేర్చుకుని మృదువుగా అంది కృష్ణవేణి, "యిక ఈ విషయం మర్చిపొండి. మనం చేయగల్గింది ఏదీ లేనప్పుడు బాధపడటం అనవసరం. ఆమెకూడా పెళ్లి చేసుకున్నది కదా! వివేకవంతులు దొరికినదానితో సంతృప్తిపడి, జీవితాన్ని అందంగా, ఆనందంగా మలచుకుంటారు"

* * *

అది భారతీ నర్సింగ్‌హోమ్ కన్సల్టింగ్ రూమ్‌లో అడుగుపెట్టాడు వాసు. ఒక ప్రక్కగ టేబిల్ ముందుకూర్చుని, తలవంచి ఏదో పెద్దపుస్తకంలో బరబరా రాస్తున్నది ఒకనర్సు అతను అడిగాడు, "ఎక్స్‌క్యూజ్ మీ, నర్స్! డాక్టరుగారు లేరా?"

ఆమె తలఎత్తకనే చెప్పింది, "ఆపరేషన్ థియేటర్లో వున్నారు. పదినిమిషాలు వెయిట్ చెయ్యండి."

ఆ కంఠస్వరానికి ఉలిక్కిపడి ఆమెను పరికించి చూశాడు వాసు.

"సుజా, నువ్వా?"

ఆశ్చర్యంగా యిటు తిరిగి చూసింది సుజాత. "వాసూ!" ఆమె పెదిమలు విడివడలేదు. పెన్నుమూసి, పుస్తకంమీద పెట్టి—యివతలికి వచ్చింది. "చాలా కాలానికి కన్పించావు? ఇలా వచ్చావేమిటి? మీవాళ్లు ఎవరైనా వున్నారా?"

చిరునవ్వు నవ్వుతున్న ఆమెవంకే చూస్తూ పలవరించాడు. "ఐదవ నెంబరు గదిలో కృష్ణవేణి అని. ఆమె నా భార్య"

"ఓ, మూడురోజుల్ర్కిందట డెలివరీ అయింది ఆమేనా! అమ్మాయి పుట్టింది. ఈరోజు డిశ్చార్జి అవబోతున్నారు కదూ. నేను నిన్నటివరకూ లీవ్ లో వున్నాను. అందుకే యిప్పటివరకు తెలియదు ఆమె నీ మిసెస్ అని. లైఫ్‌లో సెటిల్ అయ్యావన్నమాట. కంగ్రాచ్యులేషన్స్" అదే చిరునవ్వు ఆమె పెదిమలపైన

"నా సంగతి సరే! నీవేమిటి యిక్కడున్నావు? నర్స్ ట్రెయినింగ్ ఎప్పుడయ్యావు? మీ వారెక్కడ?" వాసు ప్రశ్నలకు ఆమె ముఖం కళతగ్గింది "ఏం ప్రశ్న! డైవోర్సీని మీ ఆయన ఎక్కడ అని అడుగుతారా ఎవరైనా?"

షాక్ కొట్టినట్టు అదిరిపడ్డాడు వాసు. "ఏమిటన్నావు? డైవోర్సీనా!" అఘాతంలో పడ్డవాడిలా చూసాడు.

"నిజమే పెళ్ళయిన ఆర్నెల్లకే విడాకులు యిచ్చారు వారు నా గతం తెలిసి. ఆయన లెక్చరర్ వారి అభ్యుదయభావాలు కేవలం స్టూడెంట్స్‌కి లెక్చర్లు యివ్వటానికి మాత్రమే. నా బతుకులో తొణికిన విషాదం వారిని కదిలించలేదు" పేలవంగా నవ్వి అంది సుజాత. "ఒక స్నేహితురాలి సహాయంతో నర్స్ ట్రెయినింగ్ పూర్తిచేసి, ఇందులో చేరాను."

"ఎంత నష్టపోయావు జీవితంలో. ఇదంతా నావల్లే జరిగింది. అయినా యింత సంకుచితుడా అతను?" చటుక్కున కృష్ణవేణి ప్రవర్తన గుర్తు వచ్చింది వాసుకు. "కృష్ణకు నాగురించి అంతా తెలుసు. నేనే చెప్పాను ఏమీ దాచకుండా అయినా ఆమె నాపై కోపగించుకోలేదు. నన్ను దూరం చెయ్యలేదు. ఈ యిద్దరికీ ఎంతతేడా!"

వాసు మాటలకు నవ్వింది సుజాత. ఆ నవ్వులో వెటకారం, బాధ, దుఃఖం, ఆవేశం — ఎన్నో మిళితమయ్యాయి.

"అవును చాలా తేడావుంది. ఎందుకో తెలుసా! అతను మగవాడు. ఆమె స్త్రీ. అంతే కాదు మనది పవిత్రభారత దేశం!"